క్లుప్తంగా

చేతుల శుభ్రతపై అవగాహన

ఫిరంగిపురం: విద్యార్థులు ఆహారం తినేముందు తప్పనిసరిగా చేతులు శుభ్రంగా కడుగుకోవాలని నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి ఫరీనాబేగం అన్నారు. మండలంలోని వేమవరం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ ప్లానింగ్ కాన్సెప్ట్‌లో భాగంగా 104వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా గర్భిణులు, బాలింతలకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. షుగర్, బీపీ ఉన్నవారికి రక్తపరీక్ష, యూరిన్ పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. మధ్యాహ్నం పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు, చిన్నారులకు వడ్డిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆహారం తీసుకునే సమయంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలని చెప్పారు. ఆమె వెంట ఆరోగ్యసిబ్బంది. 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

చిన్నారులకు వైద్య పరీక్షలు



మంగళగిరి: నగర పరిధి ఆత్మకూరు గణపతినగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధి శాలివాహన నగర్ అంగన్ వాడీ కేంద్రంలో జిల్లా ఆర్‌బీఎస్‌కే ఆదేశాల మేరకు హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ పి.అనూష బాల, బాలికలకు ఎత్తు, బరువు, రక్తహీనత పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఐరన్ సిరప్‌లు అందజేశారు. హెల్త్‌సెంటర్ సూపర్ వైజర్ జయలక్ష్మి, ఏఎన్ఎం విజయకుమారి, ఆశా వర్కర్ లక్ష్మీకాంతం, అంగన్‌వాడీ టీచర్ జ్యోతి పాల్గొన్నారు.

నాడు-నేడు పనులపై సమీక్ష



మేడికొండూరు: మండలంలోని అన్నిగ్రామాలలో స్కూల్స్‌లో జరుగుతున్న నాడు-నేడు పనులను బుధవారం సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ విజయలక్ష్మి, పరిశీలించారు. ఈ సందర్భంగా మండల విద్యావనరుల కేంద్రంలో నాడు-నేడు పనులకు సంబంధించి ఇప్పటివరకు జరిగిన పనులు, ఖర్చు చేసిన నిధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పలు గ్రామాలలోని పాఠశాలల వద్ద జరుగుతున్న జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. మేడికొండూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవతరగతి విద్యార్థులతో మాట్లాడారు. పబ్లిక్ పరీక్షల సన్నద్ధతపై ప్రశ్నించారు. ఈ సమావేశంలో సమగ్ర శిక్ష ప్లానింగ్ కో-ఆర్డినేటర్ జె.రవి, ఎంఈఓ ఎం.జయరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తోపుడు బండ్లు అందజేత

మంగళగిరి: నగరంలో అద్దె తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పలువురు మహిళలు, చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తోపుడు బండ్లు అందజేశారు. నగరంలోని తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకుంటున్న కుంచాల భూలక్ష్మి, బి.కామేశ్వరి, జి.సుబ్రహ్మణ్యం, షేక్ జైనబీ, సీహెచ్ వెంకట సుబ్బమ్మలకు బుధవారం నగరంలోని ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం ఆవరణ ఎదుట జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆర్కే చేతుల మీదుగా తోపుడు బండ్లను అందజేశారు. తమ జీవన భృతికి తోపుడు బండ్లు అందజేసి తమ జీవనాధారానికి బాసటగా నిలిచిన ఎమ్మెల్యే ఆర్కేకు చిరు మహిళా వ్యాపారులు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు సంకె సునీత, అనుబంధ సంఘ నాయకులు ఎండీ ఫిరోజ్, ఆకురాతి రాజేష్, బేతపూడి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణాలు పరిశీలన



తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని కొలనుకొండలో రూ.35 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణాన్ని బుధవారం ఏఈ ప్రవీణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలనుకొండలో రూ.35 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామని ఇవి పూర్తయ్యాయని, 5 రోజుల పాటు వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిపివేసి సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ క్రాంతి పర్యవేక్షణలో వాటరింగ్ చేస్తున్నట్లు ఆయన తెలియజేశారు. వాటరింగ్ అనంతరం రోడ్డుకు ఇరువైపులా మార్జిన్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన అన్నారు.

ప్రజా ప్రయోజనాలే ప్రభుత్వ ధ్యేయం

- వేసవిలో ఉండవల్లికి పూర్తిస్థాయిలో కృష్ణాజలాలు అందిస్తాం
- అభివృద్ధిని రాజకీయం చేయవద్దు
- శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి



ఉండవల్లిలో అభివృద్ధి పనుల వివరాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

తాడేపల్లిరూరల్: ప్రజా ప్రయోజనాల కోసమే వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పనిచేస్తుందని, మంగళగిరి నియోజకవర్గంలో ప్రతి ప్రాంతాన్ని గత ప్రభుత్వం కన్నా అభివృద్ధి పథంలో తీసుకువెళ్లామని మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ఉండవల్లిలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఉండవల్లిలో రూ.1.50కోట్ల వ్యయంతో కృష్ణాజలాలు అందించేందుకు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఒక ప్రెజర్ శాండ్ ఫిల్టర్‌ను ప్రారంభించిన ఆయన ఉండవల్లి గుంటూరు ఎక్స్‌క్లూయిజ్ వద్ద నిర్మిస్తున్న మరో ప్లాంట్‌ను పరిశీలించారు. అనంతరం ఉండవల్లి ఎస్టీ కాలనీలో గంజి చిరంజీవి, డీఈ కృష్ణారెడ్డిలతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఎస్సీ కాలనీలో గత 25 ఏళ్ల క్రితం నిర్మించిన పైపులు పూర్తిగా పాడైపోయాయని, వాటిస్థానంలో ఇప్పటికే కొత్త పైపులైన్లు ఏర్పాటు చేశామన్నారు. స్వయంగా వాటి నాణ్యతను పరిశీలించారు. ఉండవల్లి ఎస్సీ కాలనీ ఉన్న సమస్యలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని రాజకీయాలకు కులమతాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేస్తామని, కొంత మంది గల్లీ నాయకులు అభివృద్ధి పనులపైనా రాజకీయం చేస్తున్నారని, అలాంటివారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని, వారేదో వీడియోలు తీసుకుని ఫేస్‌బుక్‌లో పెట్టుకోవడానికి ఇలాంటి చర్యలకు పాల్పడతారని, ఇప్పటికే ఎస్సీ కాలనీలో రూ.35 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు వేశామని, ప్రత్యామ్నాయంగా రహదారులు కూడా నిర్మించామని ఆయన అన్నారు. భవిష్యత్తులో తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, మినరల్ వాటర్ కొనుక్కోకుండా శుద్ధిచేసిన కృష్ణాజల్లాలను అందించేందుకు అన్ని ఏర్పాటు చేశామని మరో వారం రోజుల్లో కృష్ణాజలాలను అందిస్తామని ఆయన అన్నారు. అనంతరం పాత ఉండవల్లి ప్రాంతంలో పలు అభివృద్ధి పనులు పరిశీలించిన అనంతరం ఓవర్‌హెడ్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఓవర్‌హెడ్ ట్యాంక్ ఫిల్లింగ్‌కు వేసిన పైపులను మార్చాలని, పాత ఉండవల్లి, కొత్త ఉండవల్లి, ఎస్సీ కాలనీ, పోలకంపాడు తదితర ప్రాంతాల్లో పాత పైపులైన్ల స్థానంలో కొత్త పైపులైన్లు ఏర్పాటు చేసి రాబోయే వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా కృష్ణాజలాలు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారి నుంచి ఉండవల్లి ఎస్సీ కాలనీకి వెళ్లే కరకట్టకు అనుసంధానంగా పోలకంపాడు లారీ స్టాండ్ నుంచి మరో రహదారిని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను సూచించారు. ఈకార్యక్రమంలో ఏఈ కిషోర్, సెక్రటరీ రాధాకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు కళ్లం సాంబిరెడ్డి, కేబుల్ బాబు, మాజీ ఎంపిటిసి సంకుర వేణు, బుర్రముక్కు భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రికల ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి

మంగళగిరి: నగరంలో వేంచేసియున్న గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల ఆహ్వానపత్రిలను బుధవారం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవిలతో కలసి ఆవిష్కరించారు. బుధవారం నగరంలోని పెదకోనేరు అభివృద్ధి పనులను పరిశీలించేందుకు విచ్చేసిన వారిని దేవస్థాన ప్రతినిధులు కలసి ఆహ్వానపత్రికలను ఆవిష్కరింపజేశారు. ఈ నెల 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈనెల 10వ తేదీ ఉదయం 8గంటలకు స్వామి వార్లను, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా చేయనున్నారు. అదే రోజు రాత్రి 7 గంటలకు గ్రామోత్సవం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 19వ తేదీ ఉదయం 8 గంటలకు నంది వాహనంపై ఊరేగింపు నిర్వహించి మధ్యా హ్నం 12 గంటలకు బ్రాహ్మణ సమారాధన సాయంత్రం 4 గంటలకు స్వామి వారి దివ్య రథోత్సవం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, పట్టణ పార్టీ కన్వీనర్ మునగాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

దుగ్గిరాలలో అభివృద్ధి పనులు



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): దుగ్గిరాల గ్రామ పరిధిలోని రెండు ఎస్సీ కాలనీల మధ్య అభివృద్ధి పనులను బుధవారం ప్రారంభించారు. రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి రెండు కాలనీ మధ్య ఉన్న ఖాళీ ప్రదేశంలో పేవర్స్ (టైల్స్) నిర్మించేందుకు రూ.18 లక్షల నిధులను కేటాయించారు. ఈ పనులకు పరిపాలనా ఆమోదం లభించడంతో అధికారులు పనులు ప్రారంభించారు. మంచికలపూడిలో పోతురాజు గుడివద్ద మురుగునీరు వెళ్లేందుకు సౌకర్యం లేకపోవడంతో సీడీఎం నిధుల నుంచి రూ.2 లక్షలు కేటాయించి ఆ పనులను సైతం ప్రారంభించినట్లు ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి తెలిపారు.

మాతృ, శిశు మరణాల నియంత్రణే లక్ష్యంగా సేవలు

కిల్కారి స్టేట్ ప్రోగ్రామ్ మేనేజర్ ఎల్.రాజు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న స్టేట్ ప్రోగ్రామ్ మేనేజర్ ఎల్.రాజు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు

తాడేపల్లిరూరల్: మాతృ శిశు మరణాల నియంత్రణే లక్ష్యంగా కిల్కారి సేవలు అందిస్తోందని స్టేట్ ప్రోగ్రామ్ మేనేజన్ ఎల్.రాజు అన్నారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై వారిని అప్రమత్తం చేసేందుకు కిల్కారి పేరిట వాయిస్ కాల్స్ అందించేందుకు ప్రభుత్వం రూపకల్పన చేసిందని అన్నారు. అనంతరం ప్రతి నెల నిర్వహించే ఆశా డే మీటింగ్‌కు విచ్చేసిన ఆశా కార్యకర్తలకు కిల్కారిపై అవగాహన కల్పించారు. గర్భిణిగా ఉన్నపుడు స్థానిక ఏఎన్ఎం దగ్గర గర్భస్థ వివరాలు నమోదు చేయించుకునేటప్పుడు ఇచ్చిన మొబైల్ నెంబర్‌కు కిల్కారి వాయిస్ కాల్స్ వస్తాయని వివరించారు. మహిళ గర్భం దాల్చిన నాల్గవ నెల నుంచి పాలిచ్చే తల్లుల వరకు, బిడ్డకు ఏడాది వయస్సు వచ్చేవరకు 72 సార్లు వాయిస్ కాల్స్ సందేశాలు వచ్చేలా కిల్కారి కార్యక్రమాన్ని డిజైన్ చేశారని వివరించారు. ఆర్‌హెచ్‌సీ పోర్టల్‌లో నమోదైన ప్రతి గర్భిణికి 01244588000 నెంబర్ నుంచి వాయిస్ కాల్ వస్తుందని, ఒకవేళ ఫోన్ ఎత్తడం మిస్ అయితే ఒకేరోజు మూడుసార్లు కాల్ వచ్చేలా రూపొందించబడిందని తెలిపారు. మరల ఆ సందేశాలను వినాలనుకుంటే 14423 టోల్ ఫ్రీ నెంబర్‌కు డయల్ చేయవచ్చని అన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యాన్ని సంరక్షించే ఈ బృహత్తర కార్యక్రమంపై ప్రతి గర్భిణికి అవగాహన కల్పించేలా ఆశా కార్యకర్తలు పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఆశా టీమ్ లీడర్ వి.రూఫస్ పాల్, గుంటూరు డీఐఓ డాక్టర్ కేవీ సుబ్బరాజు, డీటీసీఓ డాక్టర్ బి.లక్ష్మణ్ నాయక్, డీపీహెచ్ఓ కె.శాంతకుమారి, ఏఎంఓ డి.రాజు నాయక్, తాడేపల్లి వైద్యులు డాక్టర్ కె.వి. కిరణ్‌కుమార్, డాక్టర్ అనూష, ఆర్ఎంఎస్ కాలనీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మానస మంజరి, కుంచనపల్లి ఆరోగ్యకేంద్ర వైద్యుడు డాక్టర్ ఎస్. నాగేంద్రబాబు, ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు అవగాహన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం డ్వాక్రా మహిళలకు అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ డైరెక్టర్ రాజ్ ప్రసాద్ విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే రుణాలతో మహిళలు కలసికట్టుగా వ్యాపారాలు నిర్వహిస్తే అందరూ ఆర్థికంగా ఎదుగుతారని ఆయన సూచించారు. అనంతరం 30 గ్రూపుల వారు చేస్తున్న వివిధ రకాల వ్యాపారాల సమావేశాలు, ఇతర మీటింగ్‌లు ఏ విధంగా జరుగుతున్నాయన్న విషయాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కుసుమ శ్రీదేవి, డ్వాక్రా సంఘాల మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు వీరభద్రస్వామి దేవస్థానం ప్రతిష్టా మహోత్సవం

తాడికొండ: నేడు తుళ్లూరు మండలం వెలగపూడి గ్రామంలో సోమేశ్వర పూర్వక వీరభద్ర స్వామి వారి దేవస్థానం ప్రతిష్టా మహోత్సవం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8:11 గంటలకు ఉత్తర నక్షత్రయుక్త కుంభలగ్న పుష్కర కాలంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భాగంగా బొడ్డురాయి, మహా గణపతితి, సుబ్రహ్మణ్యస్వామి, శ్రీ వీరభద్రుడు, పరమశివుడు, నందీశవరుడు, ధ్వజస్తంభం, శిఖర యంత్ర ప్రతిష్టాపన జరగనుననట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేసినట్లు వారు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థికసాయం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): దుగ్గిరాల మండల పరిధిలోని మంచికలపూడి ఎస్సీ కాలనీలో అనారోగ్యంతో మృతి చెందిన ఓ కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్కే, బుధవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. దుగ్గిరాల మంచికలపూడికి చెందిన పచ్చిగడ్ల రవికుమార్ అనారోగ్యంతో ఇటీవల కాలంలో మృతి చెందాడు. మృతి చెందిన సమయంలో ఎమ్మెల్యే ఆర్కే వారి పిల్లల చదువుల నిమిత్తం రూ.లక్ష ఇస్తానని హామీ ఇచ్చారు. దుగ్గిరాలలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జడ్పీటీసీ మేకతోటి అరుణ చేతుల మీదుగా పచ్చిగళ్ల రవికుమార్ భార్యకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, దుగ్గిరాల సర్పంచి బాణావత్ ఖుషీబాయి, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ బాజీ, మైనార్టీ సెల్ నాయకులు షేక్ సుభాని పాల్గొన్నారు.

జిల్లా అదనపు కోర్టు ఏర్పాటుకు సహకారం అందించాలి

ఎమ్మెల్యే ఆర్కేను కోరిన న్యాయవాదులు

మంగళగిరి: నగరంలో నూతనంగా జిల్లా అదనపు కోర్టు ఏర్పాటు చేయబోతున్న నేపథ్యంలో బుధవారం స్థానిక బార్ అసోసియేషన్ న్యాయవాదులు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)ని కలిశారు. స్థానిక శ్రీలక్ష్మి నరసింహస్వామి వారి దేవస్థానం వద్ద ఎమ్మెల్యే ఆర్కేను బార్ అసోసియేషన్ న్యాయవాదులు కలసి నగరంలో జిల్లా అదనపు కోర్టు ఏర్పాటులో సహాయ సహకారాలు అందించాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దొడ్డక బ్రహ్మానందరావు, తోట నరసింహారావు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రేటూరి కిషోర్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ కోసూరి చంద్రశేఖర్, న్యాయవాదులు బొర్రా మధు, శీలం చైతన్య, జొన్నాదుల లెనిన్, మాచిరాజు గోవర్ధనరావు, కూర్మాల దుర్గాప్రసాద్, తలశిల మధుసూదనరావు, కొడాలి శేఖర్, చిలకా శ్రీధర్ తదితరులు ఎమ్మెల్యే ఆర్కేను కలిసిన వారిలో ఉన్నారు.

కేఎల్‌యూలో కేంద్ర బడ్జెట్‌పై వర్క్‌షాప్

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో బుధవారం కేంద్ర బడ్జెట్‌పై ఒక్క రోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జాతీయ కార్యదర్శి వై. సత్యకుమార్ విచ్చేసి తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఉపన్యసించారు. కేంద్ర బడ్జెట్ కమిటీ సభ్యులు చందూ సాంబశివరావు, లంకా దినకర్ మాట్లాడారు. అనంతరం సత్యకుమార్‌ను డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావు ఘనంగా సత్కరించారు. వీసీ డాక్టర్ జి. పార్థసారధి వర్మ, ప్రొ.వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ ఎ.జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మిల్లెట్ బఫెట్..

వర్సిటీలో జరిగిన తృణధాన్యాల వంటకాల ప్రదర్శనలు, పోటీలను వై.సత్యకుమార్ ప్రారంభించారు. వర్సిటీ ఫుడ్ టెక్నాలజీ విభాగ అధిపతి డాక్టర్ కె. శ్రీనివాసులు, విద్యార్థి వ్యవహాల డీన్ డాక్టర్ చప్పిడి హనుమంతరావులు మాట్లాడారు. వి.దేవిశ్రీ రాగులతో తయారు చేసిన బిస్కెట్‌కు ప్రథమ బహుమతి దక్కించుకోగా, కొర్రలతో కేక్‌ను తయారుచేసిన సిహెచ్ అక్షయ ద్వితీయ బహుమతి అందుకుంది. తృతీయ బహుమతిని డి.తరుణ్ గెలుపొందారు.

విలీన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి



నిడమర్రులో సీసీ రోడ్డును స్థానిక మహిళ చేత ప్రారంభింపజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

మంగళగిరి: మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి విలీన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పేర్కొన్నారు.నగర పరిధిలోని నిడమర్రులో సుమారు రూ. 3 కోట్ల నిధులతో చేపట్టిన పలు నిర్మాణ పనులను బుధవారం నగరపాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డితో కలసి పరిశీలించారు. నిడమర్రు నుంచి తాడికొండ వరకు లింకు రోడ్డు విస్తరణలో భాగంగా సుమారు 430 మీటర్ల పొడవుతో రూ.35లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆర్కే పరిశీలించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం బీసీ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, మాట్లాడుతూ నిడమర్రు బీసీ కాలనీలో గడచిన మూడు దశాబ్దాలుగా సరియైన రోడ్లు కూడా లేక స్థానికులు రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు పడేవారని, డ్రైనేజీ కాలువలు కూడా సరిగా లేకపోవడంతో మురుగు నీటి సమస్యతో ఇబ్బందులు పడేవారని తెలిపారు. సమస్యలను తన దృష్టికి తీసుకురావడంతో వారి ఇబ్బందులను పరిష్కరించేందుకు రూ.2.50 కోట్లతో ఎనిమిది సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు రెండు కిలోమీటర్ల సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఆయా నిర్మాణ పనులను పూర్తి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి వీలైనంత త్వరలోనే జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందన్నారు. అనంతరం అంబేడ్కర్ కాలనీలో రూ.2.5 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డును స్థానికుల చేత ప్రారంభింపజేశారు. కార్యక్రమంలో పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

24 గంటల్లో స్తంభాలు, వీధిలైట్లు

- సాయినగర్ కాలనీలో 40 ఏళ్లుగా లేని మౌలిక వసతులు
- కాలనీలో పర్యటించిన 24 గంటల్లోపే ఏర్పాటు చేయించిన ఎమ్మెల్యే ఆర్కే



సాయినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వీధిలైట్లు

తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పోలకంపాడు అద్దెపల్లి వారి వీధి, ముగ్గురోడ్డులోని సాయినగర్ కాలనీలో మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి పర్యటించారు. పర్యటించిన 24 గంటల్లో బుధవారం రాత్రి విద్యుత్ స్తంభాలు వేసి, వీధిలైట్లు ఏర్పాటు చేయించారు. అద్దెపల్లి వారి వీధిలో నివాసాలు ఏర్పాటు చేసుకుని 40 సంవత్సరాలు అయినా అక్కడ రోడ్డు నిర్మాణం గానీ, విద్యుత్ స్తంభాలు కానీ ఏర్పాటు చేయలేదు. మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారి నుంచి దాదాపు 450 మీటర్ల వరకు సొంత వైర్లు లాక్కుని విద్యుత్‌ను వినియోగించుకుంటున్నారు. 40 ఏళ్ల అనంతరం నిర్మించిన రోడ్డును పరిశీలించడానికి వచ్చిన ఎమ్మెల్యే ఆర్కేను విద్యుత్ స్తంభాలు, వీధి లైట్లు కావాలని అడగడంతో పాటు, ప్రతిరోజూ నివాసాల్లో వచ్చే వ్యర్థాలను తీసుకు వెళ్లడానికి ట్రాక్టర్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సౌకర్యాలన్నీ 24 గంటల్లో ఏర్పాటు చేయడంతో మంగళగిరి శాసనసభ్యులు ఆర్కేకు అద్దెపల్లి వారి వీధి వాసులు, సాయినగర్ కాలనీలో నివసించేవారు కృతజ్ఞతలు తెలిపారు.